సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం ¦ 4 ¦ జనవరి ¦ 2023



కిటకిటలాడిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీమద్ది క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



సర్వే పరిశీలన

పెనుగొండ: సిద్ధాంతంలో లంక భూముల్లో సమగ్ర భూ సర్వేను సబ్ కలెక్టరు సూర్యతేజ మంగళవారం పరిశీలించారు. సర్వేపై అధికారులతో చర్చించారు.

సీఐడీ పీపీగా రాజేంద్ర



ఏలూరు (టూటౌన్): సీఐడీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ప్రత్యేక పీపీగా మాండ్రు రాజేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

న్యూస్‌రీల్

ఏపీలో బీఆర్ఎస్‌కు అవకాశం లేదు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: ఏపీలో బీఆర్ఎస్‌కు అవకాశం లేదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెంలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని రాజకీయంగా ఎదుర్కోలేక టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దేశమంతా తిరిగి బీఆర్ఎస్‌ని స్థాపించారన్నారు. టీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్‌కు తేడా ఏమీ లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రాన్ని చీల్చడానికి కేసీఆర్ కారణం అనే విషయాన్ని ఆంధ్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని మంత్రి చెప్పారు. టీఆర్ఎస్ తెలంగాణకే పరిమితం కావాలని, బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్నంత మాత్రాన ఆంధ్ర ప్రాంతానికి ఆ పార్టీ చేసిన ద్రోహాన్ని జనం మర్చిపోరని తెలిపారు. కేసీఆర్ మాటల మాంత్రికుడు అని కొట్టు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ మాటలు నమ్మి దేశంలోనే రాజకీయంగా పతనమైపోయిందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి దొంగచాటుగా విద్యుత్తును, జలాలను తెలంగాణకు తరలిస్తున్నారని మంత్రి విమర్శించారు. తోట చంద్రశేఖర్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో బీఆర్ఎస్‌ను ఆశ్రయించారన్నారు. పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి కేసీఆర్ చేయని ప్రయత్నం అంటూ లేదని మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు.

ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం



భీమవరంలో మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌కు నిరుద్యోగుల కష్టాలు పూర్తిగా తెలుసునందు వల్లే అధికారం చేపట్టిన వెంటనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత దగ్గరచేసేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి గౌరవ వేతనం ఇస్తున్నట్లు శ్రీనివాస్ చెప్పారు. నూతనంగా ఏర్పాటుచేసే పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలను కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నియోజకవర్గాల వారీగా మెగా జాబ్ మేళాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. నిరుద్యోగులు మెగా జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొందాలన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జి.కృష్ణారెడ్డి, డీఈవో మధుభూషణ్, సీడాప్ అధికారి పార్థసారథి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రమేష్, కాలేజీ ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన, ఎంపీపీ విజయనర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేసేలా పనిచేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ జెడ్.వెంకటేశ్వరరావు

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామీణ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులకు మేలు చేసేలా పనిచేయాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తొమ్మిది మండలాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన సహాయకులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు ఏ పంట వేస్తే ఆ పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉద్యాన, వ్యవసాయ పంటలను వేర్వేరుగా నమోదు చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా వీఏఏలు, వీహెచ్ఏలు పనిచేయాలన్నారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించడానికి రైతులు పచ్చిరొట్ట ఎరువులను పెంచాలని సూచించారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి దుర్గేష్, మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరభద్రరావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఎంపీడీవో ఎం. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల కట్టడికి కసరత్తు

- ఉమ్మడి పశ్చిమలో కొనసాగుతున్న బైండోవర్ కేసుల ప్రక్రియ
- పందేలు జరిగితే స్థానిక అధికారులదే బాధ్యత
- ఇప్పటికే 900కు పైగా కేసులు నమోదు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: సంక్రాంతి సందడికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ముస్తాబవుతోంది. ఇక్కడ సంక్రాంతి సంబరాలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. కోడి పందేలు, పేకాట శిబిరాలు పెద్ద ఎత్తున వెలుస్తాయి. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో రెండు జిల్లాల పోలీసులు అప్రమత్తమై కోడి పందేల నిర్వాహకులపై ప్రత్యేక ఫోకస్ పెట్టి బైండోవర్ కేసులు కొనసాగిస్తున్నారు. ఇంతవరకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 900 కేసులు నమోదు చేశారు. మరో వారంలో పండుగ హడావుడి ప్రారంభం కావడంతో పోలీసులు మరింత దూకుడు పెంచారు. స్టేషన్ల పరిధిలో కోడిపందేలు జరిగితే స్థానిక సీఐ, ఎస్సైలను బాధ్యులను చేసి సస్పెండ్ చేస్తామని రేంజ్ డీఐజీ ఇప్పటికే హెచ్చరించిన నేపథ్యంలో కట్టడికి కసరత్తు కొనసాగిస్తున్నారు.

పందేలకు నిర్వాహకుల సన్నాహాలు

సంక్రాంతికి కోడిపందేలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధాన ఆకర్షణ.. గతంలో భీమవరం ప్రాంతానికే పరిమితమైన కోడిపందేలు, ఇతర జూద క్రీడలు ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో 15 నియోజకవర్గాల్లోను పెద్ద ఎత్తున సాగుతున్నాయి. జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది పందెంరాయుళ్ళు తరలివస్తుంటారు. ఇప్పటికే పందెంకోళ్ళ పెంపకందారులు పందేల నిర్వాహకులకు కోళ్ళను విక్రయించి జిల్లాలో కొన్ని చోట్ల భారీ బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహించడానికి అన్ని సన్నాహాలు పూర్తి చేశారు. దాదాపు నెల రోజుల నుంచి అక్కడక్కడ కోడిపందేలు నిర్వహిస్తున్న క్రమంలో వరుస కేసులు నమోదు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఇంతవరకు 400 కేసులు, పశ్చిమగోదావరి జిల్లాలో 500 కేసులు నమోదు చేశారు. ప్రతి స్టేషన్ పరిధిలో పందెం నిర్వాహకులపై, కోడికత్తుల తయారీదారులపై, కోళ్ళ పెంకందారులపై బైండోవర్లు నమోదు చేశారు.

సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం

పోలీస్ శాఖ సంప్రదాయ సంక్రాంతి క్రీడలకు ప్రాధాన్యతనివ్వడంతో పాటు పల్లెల్లో అవగాహన కల్పించడానికి అన్ని స్టేషన్ల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తుంది. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు ఇలా సంప్రదాయ క్రీడలు ప్రోత్సహించేలా కసరత్తు చేస్తున్నారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1 నుంచి అవగాహన సదస్సులు జరగాలని ఐజీ పాలరాజు ఆదేశాలు ఇచ్చారు. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఆదేశాలను పక్కాగా అమలు చేసేలా పోలీసులు కసరత్తు చేస్తున్నారు.

కోర్టు ఉత్తర్వుల్ని అనుసరించే..



హైకోర్టు ఉత్తర్వులకు లోబడి కోడిపందేలపై పూర్తి నిషేధం ఉంది. జిల్లాలో ఎక్కడ జరిగినా సీరియస్‌గా కేసులు నమోదుచేస్తాం. ఇప్పటికే పెద్ద ఎత్తున బైండోవర్ కేసులు నమోదు చేసి ముందస్తుగా హెచ్చరిస్తున్నాం. జూదక్రీడలకు దూరంగా సంప్రదాయ క్రీడల వైపు మొగ్గు చూపేలా విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. పోలీస్‌స్టేషన్ పరిధిలో పందేలు జరిగితే సంబంధిత సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేస్తాం.

– జీ.పాలరాజు, ఐజీ

కీలక డేటా ఆధారంగా..



గతేడాది పోలీసులు స్వాధీనం చేసుకున్న కోడికత్తులు (ఫైల్)

గత ఐదేళ్ళుగా జిల్లాలో కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించేవారి సమగ్ర డేటాను సిద్ధంగా చేశారు. దాని ఆధారంగా ఈ ఏడాది బైండోవర్ కేసులు నమోదు చేసి నోటీసులు ఇస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో గతేడాది 3,783 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, 4600 కోడికత్తులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. 358 మంది నిర్వాహకులు, కత్తుల తయారీదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ ఏడాది కూడా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పోలీసుల పరిధిలో నోటీసులు జారీ చేయడంతో పాటు కోడిపందేల బరుల్ని ధ్వంసం చేయనున్నారు. ప్రతి ఏటా పెద్ద ఎత్తున పందేలు నిర్వహిస్తూ కేసులు నమోదవుతున్నవారిపై ప్రత్యేక షీట్ తెరిచేలా చర్యలు తీసుకోనున్నారు.

కొత్తగా 7,123 మందికి లబ్ధి

కలెక్టర్ పి. ప్రశాంతి



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందచేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుకలో అర్హులైన 2,22,974 మంది లబ్ధిదారులకు రూ.60.84 కోట్లు అందించామని కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక కింద కొత్తగా 7,123 మందికి లబ్ధి కలిగిందని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి మంగళవారం పెన్షన్ పెంపు వారోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 2023 నుంచి పెన్షన్ రూ. 250 పెంచి రూ.2,750 ఇస్తుందని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు పెన్షన్ కానుకను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులకు రూ.60.84 కోట్ల మెగా చెక్కును కలెక్టర్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తదితరులు అందజేశారు. కార్యక్రమంలో భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కొట్టు కుటుంబరావు, తోట భోగయ్య, డీఆర్డీఏ పిడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కొనుగోళ్లు పెరిగాయి



కిరాణా వర్తక సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: వ్యాపార రంగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో కొనుగోళ్ల నిష్పత్తి బాగా పెరిగిందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ బాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కిరాణా వర్తక సంఘం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల నిధులు వ్యాపార రంగానికి ఎంతో మేలు చేశాయని అన్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో సైతం ప్రజానీకం ఇబ్బందులు పడుతున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపారం రంగం నిలబడిందంటే సంక్షేమ పథకాలేనని స్పష్టం చేశారు. వ్యాపారులంతా నిజాయితీగా నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేయాలని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమం అందిస్తూ యావత్ దేశం ఆంధ్రప్రదేశ్‌వైపు చూసేలా చేశారన్నారు. ఈ సందర్భంగా వ్యాపారరంగంలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా పరిష్కరించే దిశగా కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తణుకు కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి వీరన్న, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మాజేటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గూడెం అభివృద్ధే లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ప్రాంగణాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రోత్సాహంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. వ్యాపార పరంగా పేరొందిన పట్టణాన్ని విద్యారంగంలోను అభివృద్ధి చేశామన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు కడకట్ల–యాగర్లపల్లి ప్రాంతంలో రెండో ఫ్లై ఓవర్ నిర్మించామని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తొలిసారి ముఖ్యమంత్రిగా తాడేపల్లిగూడెం విచ్చేసిన సమయంలో ఏయూ క్యాంపస్‌ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. దేశంలోనే రెండో హార్టికల్చర్ యూనివర్సిటీని వెంకట్రామన్నగూడెంలో స్థాపించామన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న వారిని అణచివేశామని గుర్తుచేశారు. తాను రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచి అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి దేవదాయ శాఖ మంత్రి పదవితోపాటు ఉపముఖ్యమంత్రిగా పదవినిచ్చి తన బాధ్యతను పెంచారన్నారు. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నామన్నారు. కొన్ని సమయాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైనా సచివాలయ సెక్రటరీలకు సూచనలిచ్చి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఉద్యోగ విధుల నిర్వహణలో ప్రతి ఒక్క ఉద్యోగి సానుకూల దృక్పథంతో విధులు నిర్వహించాలని సూచించారు. దానికి అనుగుణంగా కార్యాలయాలను తీర్చిదిద్దామన్నారు. సానుకూల దృక్పథంతో విధులు నిర్వహిస్తే విజయం సాధిస్తామని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన వారు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఒకటో పట్టణంలో భూగర్భ డ్రెయినేజీని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు పక్కా ప్రణాళికలతో నిర్మాణం చేస్తున్నామన్నారు. పట్టణానికి శివారు ప్రాంతంలో ఎస్‌టీపీ నిర్మాణంలో ఉందన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో భూగర్భ డ్రెయినేజీ వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. తొలుత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్ చేసి అధికారులకు, పార్టీ నాయకులకు అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.బాలస్వామి, ఎంతఃఈ మురళీకృష్ణ, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, డ్వాక్రా సంఘాల పట్టణ అధ్యక్షురాలు బోళెం రామలక్ష్మి, చామన సూర్యచంద్రరావు, అడ్డాల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ అమ్మవారిని మంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్త పింఛన్ల పండుగ

- జిల్లాలో నూతనంగా 8,873 పెన్షన్ల మంజూరు
- రూ. 2.44 కోట్లు అదనంగా ఖర్చు



భీమవరం కలెక్టరేట్‌లో కొత్త పెన్షన్లు అందజేస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర కానుకగా పెన్షన్ పెంపుతో పాటు కొత్త పెన్షన్లు కూడా మంజూరు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు 8,873 కొత్త పెన్షన్లు మంజూరు చేశారు. దీంతో పెన్షన్లు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నుంచి ఏడాదికి రెండు సార్లు జనవరి, ఆగస్టు నెలల్లో కొత్త పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అర్హత కలిగిన వారందరికి పెన్షన్ కానుక అందుతుంది. ఏటా పెన్షన్ లబ్ధిదారుల సంఖ్య పెరుగుతోంది. గతేదాది డిసెంబరు నాటికి జిల్లాలో 2,18,242 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా జనవరి నుంచి జిల్లాలో 2,22,974కి లబ్ధిదారుల సంఖ్య పెరిగింది.

కొత్త పెన్షన్లకు రూ.2.44 కోట్ల చెల్లింపు:

జిల్లాలో కొత్తగా మంజూరు చేసిన పెన్షన్లకు ప్రభుత్వం ఈ నెల రూ.2.44 కోట్లు అదనంగా ఖర్చు చేయగా రూ.250 పెరగడంతో రూ 4.65 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నారు. మొత్తం 2,22,974 పెన్షన్లకు రూ.60.84 కోట్లను జనవరి నెలలో ప్రభుత్వం ఖర్చు చేసింది. జిల్లాకు మంజూరు చేసిన 8873 నూతన పెన్షన్లలో 7123 వైఎస్సార్ పెన్షన్ కానుక కాగా... 1750 పెన్షన్లు హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు మంజూరు చేశారు.

నియోజకవర్గాల వారీగా పెన్షన్ వివరాలు

నియోజకవర్గం	కొత్త పెన్షన్లు	ఖర్చు	మొత్తం పెన్షన్లు	ఖర్చు
ఆచంట	1333	రూ. 37లక్షలు	3374	రూ.9.13 కోట్లు
భీమవరం	1026	రూ. 28 లక్షలు	31586	రూ.8.70 కోట్లు
నర్సాపురం	812	రూ. 22 లక్షలు	27681	రూ.7.54 కోట్లు
పాలకొల్లు	888	రూ.24 లక్షలు	25541	రూ.6.95 కోట్లు
తాడేపల్లిగూడెం	976	రూ.27 లక్షలు	31798	రూ.8.75 కోట్లు
తణుకు	959	రూ.26 లక్షలు	36887	రూ.10.07 కోట్లు
ఉండి	1124	రూ.31 లక్షలు	35707	రూ.9.70 కోట్లు

జిల్లాలో మొత్తం పెన్షన్లు : 2,22,974 | కొత్తగా మంజూరైన పెన్షన్లు : 8,873

92 శాతం మేర పెన్షన్ల పంపిణీ పూర్తి



నూతనంగా జిల్లాకు 8,873 పెన్షన్లు మంజూరు చేశారు. మొత్తం 2,22,974 పెన్షన్లకు జనవరిలో 60.84 కోట్లు ఖర్చు చేశాం. జిల్లాలో ఇంతవరకు 92 శాతం మేర పెన్షన్లు పంపిణీ చేశాం. మిగిలినవి రెండు మూడు రోజుల్లో పూర్తిచేస్తాం

– పి.ప్రశాంతి జిల్లా కలెక్టర్

సదరం సర్టిఫికెట్ లేక ఆలస్యం



నాకు సదరం సర్టిఫికెట్ ఆలస్యం కావడంతో దివ్యాంగుల పెన్షన్ రాలేదు. ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా పెన్షన్ మంజూరు చేసింది. నేను పీజీ వరకు చదువుకున్నా ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్నాను. ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్ నాకు భరోసాగా నిలుస్తుంది.

– ఎ. శివకుమారి, లబ్ధిదారురాలు, బేతపూడి

మత్స్యకార పెన్షన్‌తో భరోసా



నాకు ప్రభుత్వం కొత్తగా మత్స్యకార పెన్షన్ మంజూరు చేయడంతో పెన్షన్ అందుకోవడం సంతోషంగా ఉంది. చేపల వేట వృత్తిలో ఇబ్బందులు పడుతున్న నాకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ మంజూరు చేసి ఆర్థికంగా భరోసా ఇచ్చారు. పెన్షన్ పెంచడం ఆనందంగా ఉంది.

– కొల్లాటి వెంకట్రాజు, పెన్షన్ లబ్ధిదారుడు, దొంగపిండి

వృద్ధాప్య పెన్షన్ వచ్చింది



నాకు 60 ఏళ్ల రావడంతో ప్రభుత్వం కొత్త పెన్షన్ మంజూరు చేసింది. నాకు పెన్షన్ రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ నా మందులకు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన వారికి పెన్షన్లు మంజూరు చేసి ఆదుకుంటున్నారు.

– వలవల నాగేశ్వరరావు, వృద్ధాప్య పెన్షన్ లబ్ధిదారుడు దూసనపూడి

ఎంతో సంతోషంగా ఉంది



నేను మా అమ్మ రైసు కార్డులో ఉండడం, ఆమెకు పెన్షన్ రావడంతో నా భర్త పోయినా కూడా వితంతు పెన్షన్ వచ్చేది కాదు. దాంతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవడంతో మా అమ్మకార్డులో తొలగించిన తర్వాత నాకు రైసు కార్డు రావడంతో ప్రభుత్వం వితంతు పెన్షన్ మంజూరు చేసింది. కొత్తగా పెన్షన్ అందుకోవడం సంతోషంగా ఉంది.

– బి.సుబ్బమ్మ పెన్షన్ లబ్ధిదారురాలు, దొంగపిండి

క్లుప్తంగా

మల్లన్న పాగా నేత ప్రారంభం



రామచంద్రపురంలో మల్లన్న పాగా నేత పని ప్రారంభించిన అందే పార్వతీశం

పెంటపాడు: మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలం మల్లన్నస్వామికి ప్రతి ఏటా పెంటపాడు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన నేతన్నల ఆధ్వర్యంలో మల్లన్న పాగా అలంకరించడం ఆనవాయితీ. కాగా ఆ పాగా నేసేందుకు అందే పార్వతీశం, కోటమ్మల ఆధ్వర్యంలో సోమవారం నేత పని ప్రారంభించారు. అయితే శ్రీశైలంలోని నిత్యాన్నదాన కర్ణభక్త సంఘ అధ్యక్షులు పొన్నా మల్లికార్జునరావు సోమవారం ప్రత్యేక పూజలు పాగా నేత పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు నేత పనివారిని అభినందించారు.

5 నుంచి షటిల్ టోర్నమెంట్

పెంటపాడు: తాడేపల్లిగూడెంలో ఈ నెల ఐదో తేదీ నుంచి షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పట్టణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నాయకులు మంగళవారం తెలిపారు. పురుషుల విభాగంలో అండర్–19 సింగిల్స్, డబుల్స్, ఓపెన్ కేటగిరిలో డబుల్స్, 45 ఏళ్ల పైబడిన వారికి డబుల్స్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనాలనే వారు బుధవారంలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ టోర్నీ ప్రారంభిస్తారన్నారు. ఇతర వివరాలకు 92912 88123 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

పకడ్బందీగా గ్రూప్–1 పరీక్షలు

- 8న భీమవరంలో 10 కేంద్రాల్లో నిర్వహణ
- ఇన్‌చార్జి డీఆర్వో దాసి రాజు
- అధికారులతో సమీక్ష సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఆర్వో దాసి రాజు, చిత్రంలో ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: జిల్లాలో ఈ నెల 8వ తేదీన నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్–1 పోటీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసి రాజు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, హాల్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం భీమవరంలో 10 కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలుగా భీమవరంలోని కేజీఆర్ఎల్ కాలేజ్, డీఎన్ఆర్ కాలేజ్, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విష్ణు మహిళ ఇంజినీరింగ్ కాలేజ్, వీఎస్కే డిగ్రీ కాలేజ్, కేజీఆర్ఎల్ కాలేజ్ పీజీ కోర్స్, డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ కళాశాల, ఆదిత్య డిగ్రీ కాలేజ్, కేజీఆర్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలను ఎంపిక చేశామన్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి కో–ఆర్డినేటర్, ప్రతి హాలుకు చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించామన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. మంచినీరు, ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కోవిడ్ నిబంధనలు విధిగా పాటించాలని, ఎవరైనా కోవిడ్ పాజిటివ్ ఉన్న అభ్యర్థులు ఉన్నట్లయితే వారికి విడిగా ఒక రూములో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. డిజేబుల్ అభ్యర్థులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలన్నారు. పరీక్షా హాలులోకి ఉదయం 9 గంటల నుంచి 9.45 గంటల మధ్య అనుమతించాలని, అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.45 గంటల వరకు మాత్రమే పరీక్ష హాలులోకి అనుమతించాలన్నారు. పరీక్ష సమయం పూర్తయ్యే వరకు ఎవరిని బయటకు పంపించవద్దని డీఆర్వో ఆదేశించారు. అందరి నుంచి ఓఎంఆర్ షీట్లు కలెక్ట్ చేసుకున్న తర్వాతే అభ్యర్థులను బయటకు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సుబ్బరాజు, చీఫ్ సూపరింటెండెంట్లు, హాల్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం



పెనుగొండ: ఆచంట మండలం కొడమంచిలిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు



ఆకివీడు: ఆకివీడు మూడో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు బ్రోచర్‌ను అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కళాకారుల వల్లే కళలకు మనుగడ

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- తణుకు వెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో కళాకారులకు సత్కారం



తణుకులో కళాకారులను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: భారతదేశ సంస్కృతి సంప్రదాయాలను కళాకారుల వల్లే మనుగడలో ఉంటున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ముక్కోటి మహోత్సవాల్లో భాగంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో మంగళవారం రాత్రి మంత్రి కారుమూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో వృత్తిపట్ల ఉన్న మక్కువతో ఎంతోమంది కళాకారులు కళారంగాన్ని పోషిస్తున్నారని అన్నారు. నాటకరంగాన్ని పెంచిపోషిస్తున్న కళాకారులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదే వేదికగా గత 40 ఏళ్లుగా ముక్కోటి ఉత్సవాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మికతతోపాటు నాటకరంగ కళాకారులకు ఉపాధి కల్పిస్తున్న నీరుల్లి పచ్చిమిర్చి కూరగాయల పండ్ల వర్తక సంఘం పెద్దల సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పాత్రలు పోషిస్తున్న 10 మంది కళాకారులతోపాటు వర్తక సంఘం పెద్దలను మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, ఆలయ చైర్మన్ కొత్తపల్లి రామచంద్రరావు, వర్తక సంఘం అధ్యక్షులు నాగిరెడ్డి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు చినిమిల్లి సాంబశివరావు, కొత్తపల్లి సత్యనారాయణ, కాపు సంఘం కార్యదర్శి ఉమ్మిడి వెంకటేశ్వరరావు, కొఠారు రామాంజనేయులు, ఖండవల్లి వెంకటేశ్వరరావు, ఆనందం మస్తాన్‌రావు (బాబి) పాల్గొన్నారు.

14 నుంచి రుస్తుంబాదలో జాతీయ కబడ్డీ పోటీలు

- పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహణ
- పాల్గొననున్న వివిధ రాష్ట్రాల నుంచి 30 జట్లు
- విజేత జట్లకు రూ.5 లక్షల ప్రైజ్ మనీ

నరసాపురం: నరసాపురం రుస్తుంబాదలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 27వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. గోగులమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటీల కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.అర్జునరావు, కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ కబడ్డీ పోటీల వివరాలను వెల్లడించారు. పురుషుల విభాగం నుంచి 15, మహిళల విభాగం నుంచి 15 కలిపి మొత్తం 30 జట్లకు ఆహ్వానం పంపామన్నారు. హర్యానా, యూపీ, చండీఘర్, రాజస్తాన్, బీహార్, కర్ణాటక, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాల్, ఆంధ్రా, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి జట్లు వస్తున్నాయన్నారు. ప్రొ కబడ్డీలో ఆడిన ఆటగాళ్లు పాల్గొననున్నట్లు తెలిపారు. మొదట్లో రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలు గత 27 ఏళ్ల నుంచి జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.75 వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు, నాలుగో బహుమతిగా రూ.25 వేలను అందిస్తామన్నారు. మొత్తంగా విజేత జట్లకు రూ.5 లక్షల ప్రైజ్‌మనీ అందుతుందని, 50 మంది రిఫరీలు పోటీల నిర్వహణ చూస్తారని చెప్పారు. ఈ సమావేశంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు చినిమిల్లి మమ్ము, గోపీ తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి పెయింటర్ మృతి



పూర్ణచంద్రసాయి (ఫైల్)

పోడూరు: పెయింటింగ్ పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై భవనం పైనుంచి కింద పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పోడూరు గ్రామానికి చెందిన శలా బసవయ్య పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. సోమవారం అతను తన కుమారుడు పూర్ణచంద్రసాయి (22)తో కలిసి గ్రామంలోని బాలసంఘం దగ్గరలో ఓ భవనానికి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో భవనం పక్కగా ఉన్న విద్యుత్ వైర్లు తగిలి పూర్ణచంద్రసాయి విద్యుత్‌షాక్‌కు గురై భవనం నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. అతనిని కుటుంబసభ్యులు, స్థానికులు వైద్యం కోసం భీమవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు బసవయ్య, సత్యవతి, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. ఘటనపై ఎస్సై వై.నాగలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని చెరువు కాపలాదారుడి ఆత్మహత్య



నికులాష్ బాగ్లరి మృతదేహం

మండవల్లి: కానుకొల్లు గ్రామంలో ఓ రొయ్యల చెరువుకు కాపాలాదారునిగా పనిచేస్తున్న ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రానికి చెందిన నికులాష్ బాగ్లరి (21) కానుకొల్లు గ్రామంలో మెతుకుల సత్యనారాయణ రొయ్యల చెరువుకు కాపలాదారునిగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 7.30 సమయంలో సత్యనారాయణ చెరువు లీజుకు తీసుకున్న సాయి అనే వ్యక్తి చెరువు వద్దకు వెళ్లి చూడగా రేకుల షెడ్‌లో దూలానికి తాడుతో ఉరివేసుకుని నికులాష్ బాగ్లరి వేలాడుతూ కనిపించాడు. దీంతో పక్క చెరువుపై కాపలా ఉంటున్న నికులాష్ బాగ్లరికి వరుసకు అన్నయ్య అయిన మైఖేల్ బాగ్లరికి సాయి జరిగిన విషయం చెప్పాడు. మైఖేల్ బాగ్లరి ఫిర్యాదు మేరకు ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శైలజకు పూలే అవార్డుపై అభినందన



తిరుపతిలో అవార్డు స్వీకరిస్తున్న శైలజ టీచరు

ముసునూరు: భావిభారత పౌరులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న కృషిని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు గుర్తించడం మహదానందం కలిగిస్తోందని సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ 2023 జాతీయ అవార్డు గ్రహీత ముసునూరు హైస్కూల్ ఆంగ్ల టీచర్ శైలజ అన్నారు. మంగళవారం సాయంత్రం చిత్తూరు జిల్లా తిరుపతిలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తులసీరామ్ ఆధ్వర్యంలో చైర్మన్ ప్రత్యూష సుబ్బారావు అధ్యక్షతన జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. అవార్డు గ్రహీతను హెచ్ఎం.శ్రీనివాస్, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధర్, ఎంపీడీఓ జి.రాణి, తహసీల్దార్ డి.సుధ, ఎంఈఓ రత్నకుమార్, ఉపాధ్యాయ సంఘ నేతలు అభినందించారు.

దానేశ్వరికి వజ్రాల హారం సమర్పణ

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న శ్రీ దానేశ్వరి అమ్మవారికి ప్రవాస భారతీయుడు రూ.10 లక్షల విలువైన వజ్రాల హారాన్ని సమర్పించినట్లు ఆలయ మాజీ చైర్మన్ కాపకాయల వీరవెంకట సత్యనారాయణ చెప్పారు. మంగళవారం దానేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రవాస భారతీయుడు వంగపండు అప్పలస్వామి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి వజ్రాల హారాన్ని అందజేసినట్లు తెలిపారు. ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, మండల వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు డీవీ కృష్ణంరాజు, గోపాలకృష్ణ, ఆలయ ఈఓ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో వలంటీర్ల సేవలు



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో నరసింహమూర్తికి పింఛను అందజేస్తున్న ఉల్లంపర్రు వలంటీర్ బుద్దా రామలక్ష్మి



గుంటూరు ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో శ్రీనివాస్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ సువర్ణరాజు



పాలకొల్లులో కర్రా ఝాన్సీకి పింఛను అందజేస్తున్న అలేఖ్య

- దూరప్రాంతాలకు వెళ్లి పింఛను సొమ్ముల అందజేత
- ఉబ్బితబ్బిబ్బవుతున్న లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా గ్రామ వలంటీర్లు పని చేస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నారు. పింఛను సొమ్ము ఇచ్చేందుకు ఇళ్ల వద్దకు వెళుతున్న వలంటీర్లు అక్కడ లబ్ధిదారులు లేకపోవడాన్ని గుర్తించి పలు సమస్యలతో సుదూర ప్రాంతాల్లో ఉంటున్న వారి వద్దకు సొంత ఖర్చుతో వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తూ అధికారులు, ప్రజల మన్నన పొందుతున్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రుకి చెందిన పెంకునేత కార్మికుడు కస్పూరి నరసింహమూర్తి దివ్యాంగుడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ బుద్దా రామలక్ష్మి తన సొంత ఖర్చుతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి అతనికి పింఛను సొమ్ము అందజేసింది. దీంతో నరసింహమూర్తి, కుటుంబ సభ్యులు ఎంతో ఆనందించారు. వలంటీర్ రామలక్ష్మి చేసిన కృషికి విద్యా, ఆధ్యాత్మికవేత్త మద్దాల వాసు, ఉల్లంపర్రు సచివాలయ కన్వీనర్ రావాడ సతీష్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నాయకులు అల్లు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి డీఎస్ పద్మాజీరావు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామానికి చెందిన వృద్ధుడు పెచ్చెట్టి శ్రీనివాస్ గుంటూరులోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. కదలలేని స్థితిలో ఉన్న అతనికి ఆ గ్రామ వలంటీర్ రాపాక సువర్ణరాజు తన సొంత ఖర్చుతో గుంటూరు వెళ్లి శ్రీనివాస్‌కు పింఛను సొమ్ము అందజేశారు. వలంటీర్ సువర్ణరాజును సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా) ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి వలంటీర్ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు.

చిట్టవరం నుంచి పాలకొల్లు వెళ్లి..

నరసాపురం రూరల్: చిట్టవరం గ్రామానికి చెందిన కర్రా ఝాన్సీ అనారోగ్యంతో బాధపడుతూ పాలకొల్లులో కుమారుని ఇంటివద్ద ఉంటోంది. దీంతో ఈ నెల వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు రాకపోవడంతో వలంటీర్ కాకిలేటి అలేఖ్య తండ్రి మధు సహకారంతో మంగళవారం పాలకొల్లు వెళ్లి కర్రా ఝాన్సీకి పింఛను అందజేసింది. ఝాన్సీ, ఆమె కుటుంబ సభ్యులు వలంటీర్ అలేఖ్య, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉంటే మండలంలో అన్ని గ్రామాల్లోనూ కొత్త పింఛన్ల పంపిణీ పండుగలా జరుగుతోంది. అధికారులు, నాయకులతో కలసి వలంటీర్లు లబ్ధిదారులకు పెంచిన పింఛను సొమ్ము రూ.2,750, కొత్తగా లబ్ధిదారులకు మంజూరైన పింఛన్లను అందజేశారు.

రైలు దిగుతుండగా.. కాలు జారి



రైల్వే ఫ్లాట్‌ఫాంపై గాయాలతో ఉన్న సురేష్

అగనంపూడి (గాజువాక)/తణుకు: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మరో ప్రమాదం జరిగింది. నెల కిందట రైలు దిగుతూ ప్రమాదానికి గురై ఓ విద్యార్థి దుర్మరణం పాలవ్వగా.. మంగళవారం నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంలో రైలు నుంచి దిగుతుండగా కాలు జారి మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దువ్వాడ అవుట్‌పోస్ట్ జీఆర్పీ ఎస్సై శాంతారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన కర్రి సురేష్ ఇంటి వద్ద బంగారం పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సురేష్ అల్లుడు ప్రవీణ్ డాక్‌యార్డ్‌లో పనిచేస్తూ శ్రీహరిపురంలో నివాసముంటున్నారు. తన కుమార్తె దీపిక గర్భిణి కావడంతో ఆమెను చూసేందుకు సురేష్ మంగళవారం తెల్లవారుజామున తణుకు నుంచి బయలుదేరారు. నిడదవోలులో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన సురేష్ జనరల్ బోగీలో ప్రయాణం చేసి మధ్యాహ్నం 12.30 గంటలకు దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. కదులుతున్న రైలు దిగే ప్రయత్నంలో అతని కాలు జారి రైలు కింద పడిపోయారు. రైలు చక్రాలు అతని కాళ్ల మీద నుంచి కదలడంతో.. రెండు కాళ్లు నుజ్జయిపోయాయి. దీంతో రైలును ఆపారు. జీఆర్పీ ఎస్సై శాంతారావు, సిబ్బంది క్షతగాత్రుడిని బయటకు తీసి 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. కొంత సమయం తర్వాత రైలు బయలుదేరింది.

ఏప్రిల్ 5న సీఐటీయూ చలో ఢిల్లీ

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు



సీఐటీయూ మహాసభల్లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్

సాక్షి, భీమవరం: దేశంలో కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు చెప్పారు. సీఐటీయూ 16 రాష్ట్ర మహాసభలకు హాజరైన సందర్భంగా భీమవరంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో రైతులు, కార్మికులపై పెద్ద ఎత్తున దాడి జరుగుతోందన్నారు. రైతు, కార్మికుల సమస్యల సాధనకు నిర్వహించే ఈ ధర్నాలో భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం నష్టాలపేరుతో ప్రైవేట్‌కు విక్రయించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉక్కు ఫ్యాక్టరీ కోసం కార్మికులు, ప్రజానీకం చేస్తున్న పోరాటానికి మద్దతుగా జనవరి 29న విశాఖలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో అఖిలపక్ష సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంఘం రాష్ట్ర కోశాధికారి ఏవీ నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక నిర్బంధాలు సరికాదు

కార్మిక ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాలు సరికాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ అన్నారు. సీఐటీయూ 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రెండో రోజు మంగళవారం ప్రతినిధులు సభ జరిగింది. మహాసభకు అధ్యక్ష వర్గంగా సీహెచ్ నర్సింగరావు, వి.ఉమా మహేశ్వరరావు, జి.బేబీరాణి, పి.అజయ్ కుమార్, కె.స్వరూపరాణి, కె.అజయ్ కుమార్ వ్యవహరించారు. కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టిన గఫూర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 690 రోజులుగా అక్కడి కార్మికులు ఆందోళన చేస్తున్నా కేంద్ర పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. గత పోరాటాల అనుభవాలతో కార్మికులు ముందుకు వెళ్లాలని గఫూర్ సూచించారు.

క్లుప్తంగా

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మండలంలోని పెదతాడేపల్లి ఆశా నగర్ లెప్రసీ కాలనీలో జాయ్ గుడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారిచే మంగళవారం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు చీరలు, మగవారికి దుప్పట్లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు జాయ్‌బాబు మాట్లాడుతూ పేదలకు, రోగులకు, వృద్ధులకు నిరంతరం మా సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఆనందకుమార్, వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

5న ద్విచక్రవాహనం వేలం

తాడేపల్లిగూడెం రూరల్: ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనానికి ఈ నెల 5వ తేదిన ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్టు రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.5వేలు డిపాజిట్, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. అత్యధిక పాట పాడుకున్న వారు 18 శాతం జీఎస్టీతో కలిపి మొత్తం సొమ్ము చెల్లించవలసి ఉందన్నారు. మిగిలిన వారి డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లించబడునని తెలిపారు.

రైతులు ఈ-క్రాప్‌ను నమోదు చేసుకోవాలి



మౌంజిపాడు గ్రామంలో నాట్లు వేసిన పొలాలను పరిశీలిస్తున్న దృశ్యం

పెంటపాడు: రైతులు తప్పక ఈక్రాప్‌ను నమోదు చేసుకోవాలని గూడెం ఏడీఏ పీ.మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం వరిపొలాల సందర్శన, రైతులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏవో పార్థసారథితో కలిపి పలు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాళ్వా సాగు విషయంలో పూర్తి మెళుకువలు తెలుసుకోవాలన్నారు. ఇష్టాను సారంగా రైతులు ఎరువులు, పురుగు మందులు వాడితే అనర్థాలు తప్పవన్నారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు సాగులో మెళుకువలు తెలుసుకోవాలన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పాలకోడేరు: యువత కోడిపందేలు, పేకాట లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పాలకోడేరు ఎస్సై సీహెచ్‌ఎస్ రామచంద్రరావు అన్నారు. మంగళవారం పెన్నాడ గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సు లో ఆయన పాల్గొన్నారు.

సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

అత్తిలి: నేటి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలెను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ తెలిపారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అత్తిలి కెనాల్‌రోడ్డులో ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ మక్కా సూర్యనారాయణ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి విద్య అవసరమని జ్యోతిరావుపూలే సహకారంతో బాలికా పాఠశాల ప్రారంభించి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, బీసీసెల్ అధ్యక్షులు రంభ సూరిబాబు, బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు గారపాటి నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కంకటాల సతీష్, షేక్ వలీ, పోలినాటి చంద్రరావు, ఆకుల చినబాబు, చిటకన వెంకట్రావు, ధర్మారావు, సబ్బితి రాజేష్, గంటానాగరాజు, కాసాగాని అబ్బులు, అడ్డగర్ల ఫ్రాన్సిస్, కాపల్లె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బల్లిపాడు హైస్కూల్‌లో....

అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ మానవ హక్కులు, ఇతర సామాజిక సమస్యలపై స్త్రీలను చైతన్యపర్చడానికి సావిత్రిబాయి పూలే మహిళా సేవా మండల్ అనే మహిళా సంఘాన్ని స్థాపించారన్నారు. ఉపాధ్యాయిని జె యామిని మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని మహిళాభ్యున్నతికి పాటుపడాలన్నారు. ఉపాధ్యాయులు ఎస్ సుజాతదేవి, ఎస్ పురుషోత్తం, సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, జి శ్రీనివాసరావు, ఎం వెంకటేశ్వరరావు, టి ఆత్మలింగం, ఐ శ్రీహర్ష పాల్గొన్నారు.



అత్తిలిలో సావిత్రిబాయ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వేల్పూరులో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ



తణుకులో సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మయ్య తదితరులు

దేశంలో మహిళల విద్య కోసం పాటుపడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే

తణుకు టౌన్: దేశంలో మహిళల విద్య, ఆత్మ గౌరవం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయురాలు సావిత్రి బాయి పూలే అని జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి చెప్పారు. మంగళవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని పీబీఆర్ గ్రౌండ్‌లో మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రి బాయి పూలే 192వ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో అణగారిన వర్గాలు, మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈసందర్భంగా సావిత్రి బాయి పూలే, జ్యోతిరావు పూలే చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి వీర్రాజు, వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, ఎంపీటీసీలు చుండ్రు శ్యామల, కత్తుల జస్పాల్, తణుకు నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమళ్ల ఫణీంద్ర, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ పొట్ల సురేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి గౌరవ అధ్యక్షుడు దాట్ల సుందరరామరాజు, ముళ్లపూడి బాబూరావు, యూత్ అధ్యక్షుడు మణికంఠ, కోట స్వామీజీ, చిటికెన సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ కనక మహాలక్ష్మీ, లతో పాటు వివిధ మండల కమిటీల నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలో మాట్లాడుతున్న హెచ్‌ఎం దత్



సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న భవిత విద్యార్థులు



సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ డా.ఎం.శ్యాంబాబు

సావిత్రి బాయి పూలేకు ఘన నివాళులు

తణుకు అర్బన్: విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధిస్తుందని నిరూపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. సావిత్రి బాయి పూలే 192వ జయంతి సందర్భంగా మంగళవారం తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా స్త్రీవిద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి మహిళలను విద్యపట్ల ఆకర్షితులుగా చేసిన ఘనత సావిత్రిబాయి పూలేకే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, కర్రి కాశీరెడ్డి, డీజే అమూల్యారావు, తాటిపర్తి శ్రీనివాసు, కొమ్మోజు రామకృష్ణ, జంగం ఆనంద్‌కుమార్, కుడుపూడి చంద్రరావు, షేక్ బాజీ, పొట్ల సురేష్, సామంతుల అప్పారావు, షేక్ సలీం, కట్టా కిషోర్ పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భవిత విద్యార్థులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, సుబ్బారావుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, కె.కుమారి, జి.ఆదిలక్ష్మి, జి.నాగలక్ష్మి, రత్నకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో....

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అడ్మినిస్టేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో అధ్యక్షురాలు కోనా హనుమాన్ సౌజన్యంతో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయిని పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అల్లూరి పద్మవర్మ, నళినిదేవి, రోజా రమణి, ఎం.సుభద్ర, ఉమా, నార్నిదేవి, రమ్యసాయి, మాధురి, సంపత్, శివ, లియో క్లబ్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయ్ పూలే జయంతి వేడుకలు

పెంటపాడు: విద్యారంగానికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలోని ఆడిటోరియంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మచారి, ఆర్.రమాదేవి, డా.జి. వాణి, ప్రేమ్‌సాగర్, జాన్‌బాబు, నాగు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారుమళ్ల ఏర్పాటులో తగిన జాగ్రత్తలు పాటించాలి

అత్తిలి: నారుమళ్ల ఏర్పాటులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన నారుని పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. అత్తిలి శివారు బొంతువారి పాలెంలో మంగళవారం సాయంత్రం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున చల్లాలని లేదా క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ, లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు, 17 రోజులకు పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎన్ మోహన్‌కిశోర్, రైతులు పాల్గొన్నారు.



అత్తిలిలో నారుమళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజేష్

పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు, 4వ వార్డు ఇన్‌చార్జ్ బి.రమణ, పట్టణ సమైక్య అధ్యక్షురాలు బి.రామలక్ష్మిలు కొనియాడారు. ఈ సందర్భంగా వార్డులో పెంచిన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. ఆయన ఏ కార్యక్రమం చేసినా ఏ పథకం ప్రవేశపెట్టినా పేద ప్రజల కోసమేనని స్పష్టం చేశారు.ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ ను పెంచుకుంటూ పోతున్నారన్నారు. ప్రస్తుతం రూ.2750కు పెంచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న 4వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు

విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్యరంగాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తున్నారని వైస్‌ఎంపీపీ పడవల సునీల్‌బాబు అన్నారు. పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో సుమారు రూ.30 వేలు విలువైన ట్యాబ్‌లను విద్యార్థులకు అందజేశామన్నారు. విద్యార్థులు వీటిని సక్రమంగా మూడు సంవత్సరాలు పాటు వినియోగించుకుని సాంకేతిక విద్యలోని మెళకువలను నేర్చుకోవాలని కోరారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ యండావు రాజన్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలను జిల్లా పరిషత్‌లో విలీనం చేసి నాడు-నేడులో అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, ఉన్నారు.



ఆగర్తిపాలెం ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు

పెంటపాడు: మండలంలోని పలు వైష్ణవ ఆలయాలు, ఆంజనేయస్వామి విగ్రహాలు వద్ద ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. అలంపురం, ముదునూరు, కె. పెంటపాడు, పరిమెళ్ల, యానాలపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి, చామంతులు, అప్పాల దండలతో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

నేడు పీచుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

నరసాపురం: పట్టణంలోని 15వ వార్డు పీచుపాలెంలో మధ్యాహ్నం 3 గంటలు నుంచి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం విలేకరులకు చెప్పారు. అంతకు ముందు మధ్యాహ్నం 2 గంటలు నుంచి పలు వార్డుల్లో సీసీ రహదారులు, డ్రెయిన్స్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొగల్తూరు: కాళీపట్నం సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ కె.శివప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ముత్యాలపల్లి, కొత్తోట, కాళీపట్నం తూర్పు, పడమర, పాత పాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్రీస్తు బోధనలతో శాంతి

పెనుగొండ: క్రీస్తు బోధనలతో శాంతి చేకూరుతుందని పాస్టర్ కె.రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం చెరుకువాడ పెంతెకోస్తు ఫెలోషిప్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. తోటివారిని ప్రేమగా చూడాలని ఏసు బోధించారన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు జి.శ్యాంబాబు, వి.జ్యోతి బాబు, గుత్తుల సాల్మన్ దొర, కె.ఆనంద్, వై.డేవిడ్ పాల్గొన్నారు.

పెంటపాడులో అగ్నిప్రమాదం

పెంటపాడు: పెంటపాడు శెట్టిబలిజపేటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక డాబా ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన కాసారపు లక్ష్మికి చెందిన ఈ ఇంట్లో సంక్రాంతి పురస్కరించుకుని సామగ్రి సర్దుతూ పరుపును తీస్తుండగా, విద్యుత్ వైర్లకు తగిలి ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో దుస్తులు, ఫర్నిచర్, వంట సామగ్రితో పాటు బీరువాలో దాచిన సుమారు రూ. నాలుగు లక్షల నగదు కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేసింది. ఎంపీపీ దాసరి హైమావతి, ఎస్సై జి.సత్యనారాయణ, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డితో పాటు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, ఎస్సీ నాయకులు బాబి, పార్టీ జిల్లా కార్యదర్శి విజయానందరెడ్డి, పెంటపాడు శాఖా గ్రంథాలయ చైర్మన్ కర్రి వరహాలరెడ్డి, పార్టీ నాయకులు కొవ్వూరి లక్ష్మణరెడ్డి, ఎంపీడీవో దామోదరరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రవీణ, కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి తీసుకువెళతామన్నారు.



ప్రమాదసంఘటనా స్థలం వద్ద ఎంపీపీ హైమావతి, ఎస్సై జి. సత్యనారాయణ, సర్పంచ్ సూర్యకళ

అభ్యసన సామర్థ్యాలను పెంచుకోవాలి



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న పీఎం శ్రీ రాష్ట్ర పరిశీలకురాలు గంగాభవానీ

తాడేపల్లిగూడెం రూరల్: మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలను పెంచుకుని ఉన్నత విద్యావంతులు కావాలని పీఎం శ్రీ స్కూల్ రాష్ట్ర పరిశీలకురాలు ఆర్‌ఎస్.గంగాభవాని అన్నారు. మండలంలోని పెదతాడేపల్లి డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని పీఎం శ్రీ స్కూల్‌కు ఎంపిక చేయడంతో మంగళవారం పాఠశాలను అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్, ఎంఈవో వి.హనుమతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకురాలు గంగాభవానీ మాట్లాడుతూ త్వరలోనే ఢిల్లీ నుంచి జాతీయ బృందం వచ్చి పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్య తదితర అంశాలను పరిశీలిస్తారని తెలిపారు. ప్రిన్సిపల్ బి.రాజారావు మాట్లాడుతూ పీఎం శ్రీ ద్వారా పాఠశాలకు మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు



డాక్టర్లను అభినందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): ఫ్యామిలీ డాక్టర్ సేవలను గ్రామాలలో విస్తృతంగా అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. భీమవరం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు గ్రామ స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అత్యుత్తమంగా నిర్వహించిన డాక్టర్లను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం అభినందించారు. డిసెంబర్ నెలలో పశ్చిమగోదావరి జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన ఐదు మంది డాక్టర్లకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. పెదకాపవరం, ఇరగవరం, ఆలమూరు, ఉండి, పెనుమంట్రలలో పనిచేస్తున్న డాక్టరు ఎస్.కె సద్దాం హుస్సేన్, మౌనిక, ప్రదీప్ కుమార్, ధర్మ తేజ, వై.అనూష ఉన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డి.మహేశ్వరరావు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ భాను నాయక్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యలమంచిలి: పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు తీర్చిదిద్దడంలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి అన్నారు. మేడపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన ప్రశ్న-జవాబు పత్రాల మోడల్ టెస్ట్ పేపర్ బుక్‌లెట్‌ను పాఠశాల ఉపాధ్యాయులు స్పాన్సర్ చేశారు. వాటిని మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ యూటీఎఫ్ రూపొందించిన ఈ బుక్‌లెట్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ, పీఎంసీ చైర్మన్ ముద్దల గోపాలకృష్ణ, హెచ్‌ఎం మంచెం వెంకటేశ్వరరావు దాతలు పంతం రామ్మూర్తినాయుడు, ఉండపల్లి బంగారుబాబు, సానబోయిన వెంకట శ్రీనివాస్, పిండి రామచంద్రరావు పాల్గొన్నారు.